



# సైంటిఫిక్ టెంపర్

## - డా॥ నరేంద్ర దభోల్కర్

నరేంద్ర అచ్యుత దభోల్కర్ మహారాష్ట్రకు చెందిన వైద్యుడు, రచయిత, ఓ మేధావి. ఒక భారతీయ హేతువాది. మూఢత్వానికి, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా గళం విప్పి, అవిశ్రాంతంగా పోరాడి, జీవితాన్ని పణంగా పెట్టిన ధీశాలి. అచ్యుత మరియు తారాబాయి దంపతులకు 1945 నవంబరు ఒకటిన పూణేలో జన్మించిన కనిష్టపుత్రుడే దభోల్కర్. సతారా, సాంగ్లీ, మీరజ్‌లలో విద్యాభ్యాసం చేసి డాక్టర్ పట్టా పుచ్చుకున్నాడు. 12 సం॥లు మంచి వైద్యునిగా ప్రజల మన్ననలతో ఆసుపత్రిని నడుపుతూ సామాజిక ఉద్యమాల పట్ల ఆకర్షితుడై 1980లో వైద్య వృత్తిని వదిలేశారు. ప్రజలలో ఉన్న మూఢ నమ్మకాలను, అజ్ఞానాన్ని రూపుమాపాలనే తలంపుతో అఖిల భారత అంధ శ్రద్ధ నిర్మూలనా సమితి (ఎం.ఎ.ఎన్.ఎస్.)ని స్థాపించాడు. భారతీయ హేతువాద సంఘానికి ఉపాధ్యక్షునిగా సేవలు అందించారు. అంధ విశ్వాసాలకు, మాంత్రిక-తాంత్రిక-క్షుద్ర విద్యలకు, దేవుళ్ళుగా చెలామణి అవుతున్న స్వాములకు - బాబాలకు వ్యతిరేకంగా గళం విప్పి ప్రజలను చైతన్యం చేసిన వ్యక్తి. ముఖ్యంగా మూఢ విశ్వాసాల వ్యతిరేక చట్టం చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచి ఆందోళనలు చేస్తున్న క్రమంలో ఛాందస - మతోన్మాద ముష్కరుల చేతిలో 20 ఆగస్టు 2013న హత్యగావింపబడినాడు. దభోల్కర్ అమరుడైన మరుసటి రోజే మహారాష్ట్ర ప్రభుత్వం **'జాదూ టోనా వ్యతిరేక బిల్లు'** ఆర్డినెన్స్ ద్వారా ఆమోదించి అమలులోకి తెచ్చింది. ఆ తరువాత కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటువంటి బిల్లునే ఆమోదించింది. అన్ని రాష్ట్రాలలో ఇటువంటి బిల్లు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**"సైంటిఫిక్ టెంపర్" గురించి అభ్యుదయ వాదైన నరేంద్ర దభోల్కర్ గారి సందేశం...** మనం శాస్త్ర యుగంలో ఉన్నాం. మనం నిత్యం నిద్ర లేచినప్పటి నుంచి నిద్రపోయేటంత వరకు సైన్స్ ప్రమేయం లేకుండా ఒక్క పనిచేయటం లేదంటే అతిశయోక్తి కాదు. ఉదాహరణకి నిద్ర లేవటానికి - గడియారం, పళ్ళు తోమటానికి బ్రష్ - పేస్ట్, మొహం కడగటానికి సబ్బు - కొళాయి నీరు- వాష్ బేసిన్ ఇలా .... కానీ

> "అప్పట్లో మానవాళి తనకు ఏం జరిగినా, ఇలా దేముడు నడిపిస్తున్నాడని, పూర్వజన్మ పాపమో లేక పుణ్యమో అని, తలరాతని, కర్మ ఫలమని, పుట్టిన ఘడియ అలాంటిదని ఇలా అనేక పలాయన వాద అశాస్త్రీయ భావనలతో ఆలోచిస్తూ మూఢ విశ్వాసాలకు బానిసలుగా ఉండి బలహీన మనసత్తత్వాన్ని కలిగియుండేవారు."
>
> – నరేంద్ర దభోల్కర్



ఓ వంద సంవత్సరాలు వెనక్కు తిరిగి చూస్తే ఇవన్నీ ఆనాడు లేవు. ఆ నాడు కోడి కూతతో లేచి, వేపపుల్లతో పళ్ళు తోముకొని బావిలోని నీరు తోడుకొని స్నానం చేసేవారు. అవునా? కాదా?

మానవాళి శాస్త్ర పరిజ్ఞానాన్ని అలవరచుకోకముందు ప్రకృతిలోని మిగిలిన జంతువుల మాదిరే బలహీన జీవులుగా మానవులు ఉండేవారు. అప్పట్లో తనకు ఏం జరిగినా, ఇలా దేముడు నడిపిస్తున్నాడని, పూర్వజన్మ పాపమో లేక పుణ్యమో అని, తలరాతని, కర్మ ఫలమని, పుట్టిన ఘడియ అలాంటిదని ఇలా అనేక పలాయన వాద అశాస్త్రీయ భావనలతో ఆలోచిస్తూ మూఢ విశ్వాసాలకు బానిసలుగా ఉండి బలహీన మనస్తత్వాన్ని కలిగియుండేవారు. పక్షిలా గాలిలో ఎగరలేడు, చేపలా నీటిలో ఈదలేడు, జింకలా పరుగెత్తలేడు, ఏనుగులా బరువు లెత్త లేడు, సింహంలా వేటాడలేడు... ఇలా బలహీనమైన జీవిగా మానవుడు ఉండేవాడు. ఎప్పుడైతే హేతుబద్ధంగా ఆలోచించటం మొదలుపెట్టి నిజమైన కారణాన్ని అన్వేషించగలిగాడో ప్రకృతిని అధిగమించాడు, ఆధిపత్యం సాధించాడు. భయంపోయి ధైర్యం వచ్చింది. లోబడి ఉండే దశ నుంచి శాసించే స్థాయికి ఎదిగాడు. బానిసత్వం నుంచి స్వేచ్ఛ లభించింది. స్వతంత్రుడైనాడు. ఈ హేతుబద్ద కారణ అన్వేషణే మానవాళి చరిత్రకు అద్భుతమైన మలుపు అనటంలో ఎటువంటి సందేహం లేదు.

సైంటిఫిక్ టెంపర్ అంటే సంక్షిప్తంగా కార్యాకారణ సంబంధం గురించి అన్వేషించడమే. సమస్యకు హేతుబద్ద పరిష్కారం కనుగొనడమే. ఇంకా చెప్పాలంటే నమ్మకాల్ని వదలి నిజాలవైపు పయనించడం. మన జీవితాన్ని మనం నిర్దేశించుకోవడమే. మనకుండే తెలివి తేటలు, జ్ఞానాన్ని క్రోడీకరించి హేతుబద్ధతతో కార్యాచరణ సంబంధం ద్వారా క్రొత్త జ్ఞానాన్ని పోగు చేసుకోవడమే సైంటిఫిక్ టెంపర్.

శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి యుండి శాస్త్రీయ పద్ధతిలో మానవాళి నిజమైన జ్ఞానాన్ని సమపార్జించుకోవడం సైంటిఫిక్ టెంపర్. ఉదాహరణకు అమరావతికి ఎలా వెళ్ళాలి అని ప్రశ్నించినపుడు ఇలా వెళ్ళండి అని ఓ వ్యక్తి దారి చూపించాడనుకోండి, అతనిని నీకెలా తెలుసు? అని ప్రశ్నిస్తే... ఆర్నెల్ల క్రితం నాకో కలొచ్చింది ఆ కల్లో చూచాననో, లేక ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటుంటే విని చెప్తున్నాననో, సోది అడిగి తెలుసుకున్నాని 3వ వ్యక్తి, నేను స్వయంగా వెళ్ళి వచ్చి చెప్తున్నానని నాల్గవ వ్యక్తి సమాధానాలు చెప్తే ఎవరి జవాబును స్వీకరిస్తారు? సహజంగానే నాల్గవ వ్యక్తి జాబాబు నచ్చుతుంది. కారణం అతనిది స్వీయ అనుభవం, రుజువులున్నాయి. నమ్మకానికి తావులేదు. నమ్మకాలతో పని లేకుండా నిజాలకు పట్టం కట్టి ముందుకు సాగడమే శాస్త్రీయ ఆలోచన – శాస్త్రీయ దృక్పథం... అదే సైంటిఫిక్ టెంపర్.

విజ్ఞానాభివందనాలతో...


**జనవిజ్ఞాన వేదిక** (ఆం.ప్ర) ఫోన్ : 98480 25687

రి.నెం: 1276/88, ఎఐపిఎస్ఎన్ అనుబంధం

Jana Vignana Vedika - Ap Like us


VINAG GRAPHICS - 9441040285